క్లుప్తంగా

లో ఓల్టేజ్ సమస్యను పరిష్కరిస్తాం



ట్రాన్స్‌ఫార్మర్ పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకుడు నరసింహారెడ్డి

జే.పంగులూరు: అలవలపాడు గ్రామంలోని లో ఓల్టేజ్ సమస్యను వెంటనే పరిష్కరించాలని వైఎస్సార్ సీపీ నాయకుడు పానెం నరసింహారెడ్డి విద్యుత్ ఏఈకి తెలిపారు. అలవలపాడు గ్రామంలోని ముస్లిం కాలనీలో గత కొన్ని నెలలుగా కాలనీలో ఓల్టేజ్‌తో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు నరసింహారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. గురువారం ఆయన కాలనీని సందర్శించి, లో ఓల్టేజ్ కారణం అయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించి, అక్కడ ఉన్న వారితో మాట్లాడారు. ఏఈ ఆంజనేయలను పిలిపించి వెంటనే సమస్యను పరిష్కరించాలని తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ స్వయంపు మనుమంతురావు, గ్రామ నాయకులు వెంకటరామిరెడ్డి, రమణారెడ్డి, నరేంద్ర, నన్నేసా తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామానికి చెందిన షేక్ ఫాతిమున్ (40) బుధవారం రాత్రి గుండె పోటుతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న నరసింహారెడ్డి, పానెం శ్రీనివాసరెడ్డి ఫాతిమున్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం భర్త భుజా, పిల్లలతో మాట్లాడి వారిని ఓదార్చి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందించారు.

మున్సిపల్ కమిషనర్‌కు అవార్డు



కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందుకుంటున్న రామచంద్రారెడ్డి

చీరాల: చీరాల మున్సిపల్ కమిషనర్ కే రామచంద్రారెడ్డి చీరాల అసెంబ్లీ నియోజకవర్గానికి ఉత్తమ అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ అధికారి అవార్డు అందుకున్నారు. గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవంలో భాగంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందుకున్నారు.

విద్యుదాఘాతానికి గురై వ్యక్తికి తీవ్రగాయాలు



దుర్గాప్రసాద్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న బంధువులు

చినగంజాం: విద్యుదాఘాతానికి గురై వ్యక్తి తీవ్రగాయాలపాలైన ఘటన గురువారం మండల కేంద్రం చినగంజాంలో చోటు చేసుకుంది. అందించిన సమాచారం ప్రకారం.. మండలంలోని పల్లెపాలెం పంచాయతీ తూర్పుపల్లెపాలెం గ్రామానికి చెందిన దండుప్రోలు దుర్గాప్రసాద్, అతని భార్య రమాదేవిలు బేల్దారి పనులు చేస్తుంటారు. ఈ క్రమంలో గురువారం చినగంజాం జాతీయ రహదారి వెంబడే ఉన్న ఒక ఇంటి పైఅంతస్తులో ఇద్దరూ పనులు నిర్వహిస్తున్నారు. ప్రమాదవశాత్తు దుర్గాప్రసాద్ తను పనిచేస్తున్న పరంజా పైనుంచి పక్కనే ఉన్న 11 కేవీ విద్యుత్‌లైన్‌పై జారి పడ్డాడు. దాంతో అతడు తీవ్ర విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. ఈఘటనలో అతని కుడి కాలు, ఎడమ చేయి బాగా కాలిపోయి తీవ్ర గాయాలపాలైనాడు, భార్య, తోటి పనివారు ప్రైవేట్ వాహనాన్ని హుటాహుటిన పిలిపించి వైద్య చికిత్స నిమిత్తం నరసరావుపేట ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. దుర్గా ప్రసాద్ ఆస్పత్రిలో అత్యవసర చికిత్స పొందుతున్నట్లు బంధువులు తెలిపారు. క్షతగాత్రుడికి ఇరువురు కుమారులు ఉన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

చినగంజాం: అప్పుల బాధ భరించలేక యువ రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కడవకుదురు గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. గ్రామంలో నివాసముంటున్న బొప్పన శ్రీనివాసరావు (42) గురువారం తన ఇంట్లో కేబుల్ వైర్‌తో ఉరేసుకొని మృతి చెందాడు. బొప్పన శ్రీనివాసరావు 7 ఎకరాలు కౌలుకు తీసుకొని తన సొంత భూమి కొంత కలుపుకొని వ్యవసాయం చేస్తున్నాడు. దీంతో అప్పుల పాలైన శ్రీనివాసరావు తీర్చలేక మానసికంగా బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో కేబుల్ వైర్‌తో ఇంట్లో ఉరేసుకొని మృతి చెందాడు. స్థానికంగా ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా పని చేస్తున్న భార్య యామిని సాయంత్రం ఇంటికి వచ్చేసరికి తలుపులు మూసి ఉండటంతో కిటికీలో నుంచి చూసింది. భర్త ఉరేసుకుని ఉండటాన్ని గమనించి పెద్దగా కేకలు వేస్తూ ఇరుగుపొరుగు వారిని పిలిచి విషయం తెలియజేసింది. ఈమేరకు స్థానిక పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం

● ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం



యద్దనపూడిలో ప్రతిజ్ఞ చేస్తున్న రెవెన్యూ సిబ్బంది, విద్యార్థులు



పర్చూరులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధికారులు



కొరిశపాడులో జాతీయ ఓటరు సందర్భంగా ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



ఇంకొల్లులో ప్రతిజ్ఞ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు



చీరాలలో విద్యార్థులతో కలిసి ఏర్పాటు చేసిన మానవహారం

చీరాల టౌన్: రాజ్యాంగం కల్పించిన ఓటు వజ్రాయుధం వంటిది.. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ విధిగా ఓటు హక్కు పొందడంతో పాటుగా ఓటును సద్వినియోగం చేసుకోవాలని చీరాల నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఆర్డీవో పి.సరోజినిరెడ్డి సూచించారు. 14వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని గురువారం చీరాలలో ఘనంగా నిర్వహించారు. చీరాల ఆర్డీవో కార్యాలయం నుంచి రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీసు, ఇతర ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, సిబ్బంది, డిగ్రీ కళాశాల విద్యార్థులతో కలిసి ఓటు హక్కుపై అవగాహన కల్పించి పట్టణంలో ప్లకార్డులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక గడియార స్తంభం సెంటర్‌లో మానవ హారాన్ని ఏర్పాటు చేసి ప్రభుత్వ అధికారులు, విద్యార్థులు, ఉద్యోగులు, ఓటర్లతో కలిసి ఆర్డీవో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం వద్ద చీరాల్లో ఉన్న సీనియర్ సిటిజన్ ఓటర్లను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు, ఎంపీడీవో నేతాజీ, రీ సర్వే డిటీ, పట్టణ ఆర్ఐ దేవతోటి అర్జున్, వీఆర్వోలు, సీనియర్ ఓటర్లు, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటుతోనే ప్రజాస్వామ్యం సాధ్యం..

యద్దనపూడి/కారంచేడు/చినగంజాం/మార్టూరు: ప్రజా స్వామ్యానికి ప్రతిబింబమే ఓటు అని, దానిని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వినియోగించుకోవాలని యద్దనపూడి తహశీల్దార్ రవికుమార్ అన్నారు. గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని రెవెన్యూ సిబ్బంది గురుకుల పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీటీ రవికుమార్, వీఆర్వోలు, పాల్గొన్నారు.

☛ జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా వలపర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థుల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు గ్రామంలో నినాదాలతో వీధుల వెంట ప్రదర్శన నిర్వహించారు. గ్రామస్తులకు ఓటు గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి కె. వెంకటేశ్వర్లు, పీఈటీ రవి దేవరాజు పాల్గొన్నారు.

☛ అర్హత కల్గిన ప్రతి ఒక్క యువతీ, యువకుడు తప్పనిసరిగా ఓటు హక్కు కలిగి ఉండాలని కారంచేడు తహశీల్దారు ఎస్ వెంకటరత్నం అన్నారు. ఆయన మండలంలోని స్వర్ణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జాతీయ ఓటరు దినోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పంచాయతీ కార్యాలయం వద్ద సీనియర్ సిటిజన్ సుధా నాగేశ్వరరావును సత్కరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఆర్ రమేష్‌బాబు, వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు, బీఎల్‌ఓలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

☛ అందరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని పర్చూరు తహసీల్దార్ సంధ్యశ్రీ అన్నారు. 14 వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గురువారం జూనియర్ కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి ఓటర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ ప్రేమ్‌కుమార్, వీఆర్వోలు, విద్యార్థులు పాల్గొన్నారు.

☛ ఇంకొల్లులో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో తహశీల్దార్ పీ బ్రహ్మయ్య ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవం సంబరాలు నిర్వహించారు. మండలం నుంచి బెస్ట్ బీఎల్‌ఓలుగా పీఎస్ నంబర్ 237 మేరీ జ్యోత్స్న, పీఎస్ నంబర్ 240 బీ అపర్ణా దేవిలు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం టీ ఆదినారాయణ, ఏఎస్‌ఓ పుష్పలత పాల్గొన్నారు.

☛ బుల్లెట్ కంటే బ్యాలెట్ శక్తివంతమైనదని ఇడుపులపాడు విద్యాపరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పిడవర్తి పేరిరెడ్డి అన్నారు. ఇడుపులపాడు విద్యా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని పురస్కరించుకొని పాఠశాల హెచ్‌ఎం పిడవర్తి పేరిరెడ్డి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.

మేదరమెట్ల: మండల కేంద్రం కొరిశపాడు దండు రామకృష్ణారెడ్డి ప్రభుత్వ పాఠశాల ఆవరణలో జాతీయ ఓటరు దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ సుశీల ఓటు హక్కు వినియోగం, ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించిన అనంతరం సీనియర్ ఓటర్లను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో డీటీ మెహతాజ్, ఆర్ఐ రవికాంత్, జైపాల్, రెవెన్యూ సిబ్బంది, హెచ్‌ఎం వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి ఫోన్ చేసినా స్పందిస్తా..

● సమన్వయకర్త చిన హనిమిరెడ్డి



కొప్పరంలో ఆలయ నిర్మాణానికి శంకుస్థాన చేస్తున్న హనిమిరెడ్డి



నంబూరిపాలెంలో క్రీస్తు ప్రార్థన మందిరాన్ని ప్రారంభిస్తున్న హనిమిరెడ్డి



మసీదు పనులను పరిశీలిస్తున్న హనిమిరెడ్డి

సంతమాగులూరు (అద్దంకి)/అద్దంకి రూరల్: ప్రజలు, కార్యకర్తలు, నాయకులు ఎవరు.. ఎప్పుడు ఫోన్ చేసినా స్పందిస్తానని అద్దంకి నియోజకర్త సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని కొప్పరం గ్రామంలోని నూతనంగా నిర్మిస్తున్న మసీదు పనులను ఆయన పరిశీలించారు. పనుల వివరాలను అక్కడి వారిని అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సూచించారు. ముస్లింలతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సమన్వయకర్త మాట్లాడుతూ ఏ సమస్య ఉన్నా నేను ఉన్నానని మరిచిపోవద్దని వారితో చెప్పారు. అర్ధరాత్రి ఫోన్ చేసినా ఫోన్ స్పందిస్తానని చెప్పారు. అందరూ వైఎస్సార్ సీపీ విజయం కోసం కృషిచేస్తే, నేను మీ సమస్యల కోసం పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, మండలంలోని వివిధ హోదాల్లో ఉన్న నేతలు పాల్గొన్నారు.

దేవాలయాలు ప్రశాంత నిలయాలు..

దేవాలయాలు ప్రశాంతతకు నిలయాలని హనిమిరెడ్డి అన్నారు. కొప్పరం గ్రామంలో అంకమ్మ తల్లి నూతన ఆలయ శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఆలయంలోని అంకమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ చింతా రామారావు, జెడ్పీటీసీ అడవి శ్రీనివాసరావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు. అద్దంకిలోని నంబూరిపాలెంలో క్రీస్తు సంఘం నూతన ప్రార్థనా మందిరాన్ని చినహనిమిరెడ్డి ప్రారంభించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అద్దంకి పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ కాకాని రాధాకృష్ణమూర్తి, స్థానిక నాయకులు కోట శ్రీనివాసకుమార్, జజ్జర ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

అద్దంకి: పట్టణంలోని కట్టా రామకోటేశ్వరరావు ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో గురువారం నిర్వహించిన మెగా జాబ్ మేళాలో 53 మందికి ఉద్యోగాలు వచ్చాయి. హీరో మోటో కార్ప్, పేటీఎం, బిట్ యూనివర్స్, విట్ యూనివర్స్ ఫ్రంట్ అండ్ డెవలపర్స్ కంపెనీలు పాల్గొన్నా ప్రిన్సిపాల్ వీ మోహనరావు తెలిపారు.

తాగునీటి ఎద్దడి లేకుండా జాగ్రత్తలు



సమస్యలపై చర్చిస్తున్న పాలకులు, అధికారులు

కారంచేడు: వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు అధికారులకు సూచించారు. గురువారం ఆయన మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ అధ్యతన ఏర్పాటు చేసిన మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. ఇటీవల తుఫాను కారణంతో కొట్టుకుపోయిన కొమ్మమూరు కాలువ కట్టల మరమ్మతులను వెంటనే పటిష్టంగా జరిగించేలా చర్యలు తీసుకోవాలని వైస్ ఎంపీపీ యార్లగడ్డ సుబ్బారావు కేడబ్ల్యూడీ అధికారులకు సూచించారు. అలాగే ప్రస్తుతం కొమ్మమూరు కాలువ ఆయకట్టు కింద సాగయిన వరి చేలల్లో కోతలు ప్రారంభమయ్యాయని, ధాన్యం ఇంటి వద్ద నిల్వలు చేసుకొనేందుకు అవకాశాలు లేని సన్న, చిన్నకారు రైతులు ధాన్యాన్ని అమ్ముకోవడానికి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు వ్యవసాయ అధికారులు చొరవ తీసుకోవాలని ఆయన కోరారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులను గ్రామాల్లో పంపిణీ చేయడంలో వలంటీర్లు నిర్లక్షంగా ఉన్నారని జెడ్పీటీసీ సభ్యురాలు యార్లగడ్డ రజనీశ్రీనివాసరావు అన్నారు. ఆదిపూడిలో తాగునీటికి నిధులు, కుంకలమర్రు హైస్కూల్ రోడ్డుకు కూడా నిధులు ఇవ్వాలని ఎంపీటీసీ సభ్యురాలు చుక్కా రత్నకుమారి కోరగా ఆయన అందుకు సమ్మతించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు యార్లగడ్డ సుబ్బారావు, ఐనంపూడి వనజ, ఎంపీడీఓ పీ లక్ష్మీనారాయణ, తహశీల్దారు ఎస్ వెంకటరత్నం, ఎంఈఓ ఎంవీ సత్యన్నారాయణ, వైద్యాధికారులు, అన్ని శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేను గాంధీని చూశాను..

● ఆనందంతో వివరాలు వెల్లడించిన కృష్ణారావు



కృష్ణారావు

పర్చూరు (చినగంజాం): గత స్మృతుల జ్ఞాపకాలు చరిత్రకు సాక్ష్యాలు. కాల క్రమేణా అన్నీ కాలగర్భంలో కలిసి పోతున్న ఈ తరుణంలో పర్చూరుకు చెందిన గోకుల కృష్ణారావు నాటి జ్ఞాపకాలకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచాడు. ఆయన రిపబ్లిక్ డే దినోత్సవం సందర్భంగా గురువారం సాక్షితో తన జ్ఞాపకాలను పంచుకున్నారు. గాంధీజీ చూసిన ఆయన అనుభవాన్ని ఆయన మాటల్లో విందాం. 1943లో స్వాతంత్ర్యం కోసం అక్కడక్కడ గొడవలు జరుగుతున్నాయని ఊళ్లో అందరూ చెప్పుకుంటున్నారు. ఒక రోజు నేను మా ఇంటి దగ్గర ఆడుకుంటున్నాను. బజార్లో అందరూ మంచాల సీతారామయ్య వారింటికి త్వరత్వరగా వెళ్తున్నారు. మంచాల సీతారామయ్య అంటే పర్చూరులో పెద్ద భూస్వామి. వాళ్ల హడావుడి చూసి నేను కూడా అటువైపు పరుగెత్తుకుంటూ వెళ్లాను. వాళ్లింటి దగ్గర ఓ మనిషి నిలబడి ఉన్నాడు. వెళ్లిన వారందరూ ఆయన వైపే చూస్తు నిలుచున్నారు. ఎవరాయన అని నేను పక్కన వాళ్లని అడిగితే గాంధీ అని చెప్పారు. నేను గాంధీని చూస్తూ అక్కడే అరగంట సేపు నిలబడి పోయాను. ఎక్కడికో వెళ్తూ రాత్రి కావడంతో ఇక్కడ ఆగారంట. అక్కడే ఉన్న మంచాల సీతారామయ్య, నారిశెట్టి రాఘవయ్య, అర్వపల్లి వెంకటేశ్వర్లుతో గాంధీ కొద్ది సేపు మాట్లాడారు. తరువాత అక్కడి నుంచి నేను ఇంటికి వెళ్లిపోయాను. అప్పుడు గాంధీని చూసిన వారిలో ఇప్పుడు ఎవరూ బతికి లేరు. పర్చూరులో నాస్నేహితులు అందరూ చనిపోయారు. నేను కూడా ముసలవాడినైపోయాను. నాకిప్పుడు 88 సంవత్సరాలు అని కృష్ణారావు తెలిపారు. గత స్మృతులు పంచుకోవడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు.

సీనియర్ సిటిజన్స్‌కు సన్మానం



సన్మానం అందుకున్న సీనియర్ ఓటర్లు

చీరాల అర్బన్: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రమైన బాపట్లలో నిర్వహించిన జాతీయ ఓటర్ల దినోత్సవంలో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ చీరాల శాఖ సభ్యులను జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా సన్మానించారు. బాపట్ల వ్యవసాయ కళాశాల ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో సీనియర్ ఓటర్లు, సీనియర్ సిటిజన్స్ సభ్యులు విశ్రాంత ప్రిన్సిపాల్ ఎ.నాగవీరభద్రాచారి, విశ్రాంత ఎంఈవో గాదె హరిహరరావు, విశ్రాంత వ్యవసాయశాఖ ఏడీ జి.వీరబ్రహ్మం, విశ్రాంత కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎం దశరథరామయ్య, విశ్రాంత డిప్యూటి తహశీల్దార్ మొండితోక కోటేశ్వరరావులను ఘనంగా సన్మానించారు.

తారు రోడ్డు లారీ బోల్తా



రహదారిపై పడిపోయిన తారు లారీ

జే.పంగులూరు: మండల పరిధిలోని ముప్పవరం గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై గురువారం తారు రోడ్డు లారీ బోల్తా పడింది. విజయవాడ నుంచి నెల్లూరుకు తారు లోడుతో లారీ బయలుదేరింది. ముప్పవరం వద్దకు వచ్చే సరికే లారా లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ శంకర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. లారీ నుంచి తారు రోడ్డుపై పడిపోయింది. ఘటనా స్థలానికి చేరుకున్న రేణింగవరం ఎస్సై తిరుపతిరావు ట్రాఫిక్‌ను మళ్లించాడు.

ఆడుదాం ఆంధ్రాతో క్రీడాకారులకు అవకాశాలు



జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో అధికారులు

చీరాల టౌన్: క్రీడారంగంలో ఏపీకి పూర్వవైభవం తీసుకువచ్చేందుకే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ఏర్పాటు చేశారని ఆర్డీవో పి. సరోజిని, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, ఎంపీడీవో నేతాజీ, కమిషనర్ కె.రామచంద్రారెడ్డి అన్నారు. ఎస్ఆర్ అండ్ పీఎం మున్సిపల్ హైస్కూల్లో జరుగుతున్న పోటీలు గురువారంతో ఘనంగా ముగిశాయి. బాలురు, బాలికలు సీనియర్ విభాగాల్లో ఫైనల్ పోటీలకు క్రికెట్, వాలీబాల్, టెన్నిస్, ఖోఖో నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చీరాల ప్రాంతంలోనే అధికంగా క్రీడాకారులను తయారు చేసిన శిక్షకులు, మైదానాలు, సామగ్రి అందుబాటులో ఉందన్నారు. ఉత్తమ ప్రతిభ చూపి విజేతులగా నిలిచిన జట్లకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో హైస్కూళ్ల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, పీఈటీలు తదితరులు ఉన్నారు.

ఎంపీటీసీ సభ్యులకు సెల్‌ఫోన్ల పంపిణీ



వైస్ ఎంపీపీ వనజకు నగదు బహుమతిని అందిస్తున్న ఎంపీపీ

కారంచేడు: సామాజిక సేవలో ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు తనదైన శైలిలో సేవ చేస్తూ అందరి మన్ననలు అందుకుంటున్నాడు. ఎంపీపీగా ఎన్నికైన దగ్గర నుంచి ప్రతి మండల సర్వసభ్య సమావేశానికి తోటి ఎంపీటీసీ సభ్యులకు చిన్న, చిన్న బహుమతులు అందించడంతో పాటు, సొంత నిధులతో భోజన సౌకర్యం కల్పిస్తుంటారు. గురువారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు 12 మందికి స్మార్ట్‌ఫోన్లను బహూకరించారు. దీంతో ఎంపీటీసీ సభ్యులు ఎంపీపీకి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన వైఎస్ ఎంపీపీగా ఉన్న ఐనంపూడి వనజ గ్రూప్–2కి సిద్ధపడుతున్న విషయాన్ని తెలుసుకొని ఆమె కోచింగ్ నిమిత్తం వినియోగించుకోమని అప్పటికప్పుడు రూ.50 వేల నగదును ఉచితంగా అందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు యార్లగడ్డ రజనీ శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు, మండల కోఆప్షన్ మెంబర్ ముల్లా నూర్అహ్మద్, చల్లా అప్పిరెడ్డిలు పాల్గొన్నారు.

రోషాగ్ని హీరోపై దాడి

అద్దంకి రూరల్: రోషాగ్ని సినిమా హీరో కాలసూర్య రాజావీరరాజుపై గ్రామస్తులు కర్రలతో దాడి చేశారు. ఈఘటన గురువారం రాత్రి మండలంలోని కొటికలపూడి గ్రామంలో చోటుచేసుకుంది. రాజావీరరాజు ఫిర్యాదు మేరకు. ఎస్సై వెంకటేశ్వర్లు కేసు నమోదు చేశారు. ఎస్సై వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రాజావీరరాజు గత కొంత కాలంగా గ్రామంలో ఉండక పోవటంతో అతనికి ఉన్న ఖాళీ స్థలంలో గ్రామస్తులు పశువులు కట్టి వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల గ్రామానికి వచ్చిన రాజావీరరాజు తన స్థలంలో పశువులు కట్టివేయవద్దని చెప్పటంతో కోపానికి గురైన వారు వీరరాజుపై కర్రలతో దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో వీరరాజుకు, అతని కుమారుడు సూర్యరాజుకు గాయాలయ్యాయి. వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు.